రోడ్లపై వరద ప్రవాహం

వర్షం పడిన ప్రతిసారి ఇబ్బంది పడుతున్న ప్రజలు





చిన్మయమార్గ్‌లో పొంగిపొర్లుతున్న వరదనీరు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మిర్జాలగూడ చిన్మయమార్గంలో వర్షం పడిన ప్రతిసారి డ్రైనేజీ నీటితో కలిసి రోడ్లపై నీరు ప్రవహిస్తుందని స్థానికులు, మిర్జాలగూడ వెల్ఫేర్ అసోసియేషన్ చిన్మయమార్గ్ ప్రతినిధులు తెలిపారు. వర్షం వచ్చిన ప్రతిసారి దశాబ్దకాలంగా ఈ సమస్య ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా మిర్జాలగూడ చిన్మయమార్గంలో కూడా మాస్టర్ లేఅవుట్ ప్రకారం 66 ఫీట్ల రోడ్డు ఉందని దానికి 33 ఫీట్ల రోడ్డు అని చూపి అధికారులు గతంలో ఇంటి నిర్మాణాల కోసం అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఈ నిర్మాణాల వల్లే తమకు వర్షం పడిన ప్రతిసారి రోడ్డు ఆక్రమణలకు గురై వర్షపునీరు పొంగిపొర్లుతూ ఇళ్లలోకి వచ్చి చేరుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ఆక్రమణలపై తాము గతంలో ఉన్నతాధికారులతో పాటు న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించామన్నారు. ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి సమస్యలు వివరించామని, తమ సమస్యలకు స్పందించి ఆయన సైతం గత కొద్ది రోజుల క్రితం మిర్జాలగూడ చిన్మయ మార్గ్‌కి వచ్చి రోడ్డు ఆక్రమణలను పరిశీలించారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, దశాబ్దకాలంగా వర్షం వచ్చిన ప్రతిసారి పొంగిపొర్లుతున్న డ్రైనేజీ, కలుషితమై వస్తున్న వర్షపు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చూపాలని కోరుతున్నారు.

గుంతలు.. చింతలు





అన్నపూర్ణ సొసైటీలో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ సొసైటీలో రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఏళ్ల తరబడి రోడ్డు గుంతలమయంగా మారినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిన ప్రతిసారి గుంతల్లో నీరు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. చీకటి పడితే రోడ్డుపై ప్రయాణం సాగించాలంటే నరకయాతన అనుభవించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



శ్రీనగర్ కాలనీలోని సీసీరోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలోని చిలుకానగర్ డివిజన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంగళవారం చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ స్థానికులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. శ్రీనగర్‌కాలనీలో రూ.26 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని లేదంటే సహించేది లేదని సూచించారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. వర్షపు నీరు రోడ్డు మీద నిల్వకుండా ఉండేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈఈ హరిలాల్, ఏఈ రాజ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్‌కు చెందిన శ్రీనివాస్‌గౌడ్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. నాయకులు చిన్నాయాదవ్, నవీన్‌యాదవ్, సుకేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

కేటీఆర్‌కు పండగ శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ గీత

ఉప్పల్: చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్, డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు మంగళవారం మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు శాలువా కప్పి శమీపత్రాన్ని అందజేశారు. పార్టీ అధికారంలో లేకపోయినా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు చేయాలని కేటీఆర్ సూచించినట్లు చెప్పారు. జగన్, బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, కొండల్‌రెడ్డి తదితరులున్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మౌలాలి : గత కొద్దికాలంగా జంట నగరాలలో దుర్గామాత విగ్రహాలపై దుష్కరులు చేస్తున్న దాడులకు నిరసనగా మంగళవారం ఉదయం మౌలాలి డివిజన్‌లోని ఓల్డ్ సఫిల్‌గూడ నుంచి సంతోషిమాత చౌరస్తా వరకు స్థానిక కార్పొరేటర్, డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాయిబాబుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది హిందూ బంధువులు పెద్దఎత్తున నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. 'హిందువులంతా ఏకం కావాలి' అనే నినాదంతో పరిసర ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ సునీతాయాదవ్ మాట్లాడుతూ.. హిందూ దేవాలయాలను రక్షించలేని ఈ ప్రభుత్వం పోలీస్ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని, దీనికి నైతిక బాధ్యత సీఎం, పోలీసు శాఖ, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. అమ్మవారి విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని లేదంటే హిందువులందరితో కలిసి పెద్దఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు.

మౌలాలి : సికింద్రాబాద్‌లోని కుమ్మరిగడ్డలోని ముత్యాలమ్మ దేవాలయంలో దుండగులు అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన చాలా బాధాకరం. విషయం తెలియగానే ఆలయానికి వెళ్లి స్థానిక కార్పొరేటర్ దీపికతో కలిసి వినాయక్‌నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి సందర్శించారు. దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాల్సిందేనని స్పష్టం చేశారు. డివిజన్ ప్రెసిడెంట్ ఓం ప్రకాష్, జ్యోతి, సాయిసురేష్, శ్రీకాంతయాదవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి తదితరులు

బోడుప్పల్: బోడుప్పల్‌లోని నిమిషాంబదేవి, పోశమ్మ, బంగారు మైసమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ పూజల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నేతలు నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు రాపోలు రాములు పాల్గొన్నారు. వేద పండితుల ఆశీర్వచనాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఆలయాలు ప్రశాంత నిలయాలుగా ఉండాలని సూచించారు. స్థానిక కార్పొరేటర్ చీరాల నర్సింహ, మేడ్చల్ నియోజకవర్గ బీ- బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు బొమ్మక్ శ్రీనివాస్, చెంచల నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి

మల్లాపూర్: ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి డ్రైవర్లకు సూచించారు. మంగళవారం నాచారం పోలీస్‌స్టేషన్‌లో ఆటో యూనియన్ నేతలు, డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలను నడపకూడదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్‌లో వాహనాలను అతివేగంగా నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్ధరాత్రి వేళల్లో ఆటోస్టాండ్, ఆటోలో కూర్చొని అసాంఘిక కార్యక్రమాలు చేపట్టినట్లు తమ దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్, ఎస్సై వెంకటయ్య, ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలపై చర్యలేవి ?

పరిరక్షించాలని కాలనీవాసుల ఆందోళన

బోడుప్పల్: కబ్జాదారుల నుంచి తమ ప్లాట్‌లను కాపాడాలని అంబేడ్కర్‌నగర్ ఫేస్ - 3 కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. మంగళవారం బోడుప్పల్ దేవేందర్‌నగర్, అంబేడ్కర్‌నగర్ ఫేస్ 1,2, రాజీవ్‌నగర్, గౌతమీనగర్ కాలనీల్లో ఖాళీగా ఉన్న ప్లాట్‌లను కొంతమంది కబ్జా చేసి స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. 10 మంది వ్యక్తులు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి ఖాళీగా ఉన్న ప్లాట్‌లకు ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్‌లు సృష్టించారని ఆరోపిస్తున్నారు. సదరు స్థలంలో రాత్రికి రాత్రే ఇంటి నిర్మాణాలు చేపట్టి విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని వాపోయారు. బోడుప్పల్ కాలనీల సంక్షేమ సంఘాల సమాఖ్య చైర్మన్ రాపోలు రాములు, ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, అబ్రహం లింకన్ దృష్టికి తీసుకెళ్లారు. వారు ఘటనా స్థలాన్ని సందర్శించి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పేదల స్థలాలు కబ్జా చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



పట్టాలతో ఆందోళన చేపట్టిన కాలనీవాసులు

అభినందన



మల్కాజిగిరి: మల్కాజిగిరికి చెందిన పంజాల వైష్ణవి త్రోబాల్‌లో సత్తా చాటింది. జాతీయ జట్టు సభ్యురాలిగా ఇటీవల బ్యాంకాక్ కాసెమ్ బ్యాండిట్ యూనివర్సిటీలో జరిగిన త్రోబాల్ పోటీల్లో ఇండియా థాయిలాండ్ జట్టును ఓడించడంతో ఆమె కీలకంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా స్థానికులు అభినందించారు.

సత్కారం



మల్లాపూర్: దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతగా ముగిసిన సందర్భంగా మంగళవారం నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ ఆటో యూనియన్ నేతలు సాయికుమార్, పాండునాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్‌గా మోసెస్ భాస్కర్

ఉప్పల్: ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్‌గా మోసెస్ భాస్కర్ నియమితులయ్యారు. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఆర్. సతీష్ బదిలీపై మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఖమ్మం సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన భాస్కర్ బదిలీపై వచ్చారు.

వ్యక్తి అదృశ్యం



లక్ష్మణ్‌రావు (ఫైల్)

అల్వాల్: వ్యక్తి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ పీబీ కాలనీకి చెందిన పసుపులేటి లక్ష్మణ్‌రావు(78) మానసిక స్థితి సరిగ్గా లేదు. ఈనెల 12న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శుభాకాంక్షలు



మలిపెద్ది సుధీర్‌రెడ్డితో వెంకటేష్‌గౌడ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొంపల్లి వెంకటేష్‌గౌడ్ జన్మదినం సందర్భంగా మంగళవారం మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం కొంపల్లి వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా తనవంతు కృషి చేస్తున్నానన్నారు. పీర్జాదిగూడ కో- ఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

కీసర: ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయనున్నట్లు కీసర మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్యామల తెలిపారు. 3 నెలలు పైబడిన దూడలతో పాటు ఆవులు, గేదెలకు టీకాలు వేయించాలని కోరారు. దీని ప్రభావంతో పశువులకు అధిక జ్వరం, నోటిలో పుండ్లు, కాలి గిట్టలలో పుండ్లు ఏర్పడి నడవలేక పోతాయన్నారు. పాల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని, దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. పశువులకు వచ్చే ఈ వ్యాధిని టీకాలతో నివారించవచ్చన్నారు.

విద్యార్థులకు తోడ్పాటు అందిస్తాం



ఓమర్ ఫరూక్‌కి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని ఎండోమెంట్ కాలనీకి చెందిన ప్రసన్నకుమార్ రేఖశ్రీల కుమార్తె యోగితా ఆర్‌వీఎం ములుగు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం స్థానిక టీఆర్ఎస్ నేతల ద్వారా తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఫీజు రూ.60 వేల చెక్కును మంగళవారం విద్యార్థి ఇంటికెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంబీబీఎస్ వైద్య విద్యలో ప్రవేశానికి లక్షలాది మంది పోటీ పడతారని అందులో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన వివిధ బస్తీలు, కాలనీలో విద్యార్థులు ప్రతిభ చూపి మెడిసిన్‌లో సీట్లు సాధించి ఫీజులు చెల్లించలేని పేద మధ్యతరగతి విద్యార్థులకు కోర్సు పూర్తయ్యే వరకు ఫీజు చెల్లించే బాధ్యత తనదేనన్నారు. మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్న్యనాగేశ్వర్‌రావు, సీనియర్ బీఆర్ఎస్ నేతలు ప్రభాకర్‌రెడ్డి, సర్వబాబుయాదవ్, పవన్, శంకర్, చాంద్‌పాషా, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: పేదింటి విద్యార్థులకు అండగా ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని పేదింటి విద్యార్థులకు బీఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా ఆపన్న హస్తాన్ని అందిస్తూ.. ఉచితంగా ఫీజులు కడుతూ ముందుకు సాగుతున్నారు. మంగళవారం నాచారం రాఘవేంద్రనగర్‌కు చెందిన మహమ్మద్ ఖాజా కుమారుడు మహమ్మద్ ఓమర్ ఫరూక్ ఇంటికి వచ్చి మొదటి ఏడాది ఫీజు రూ.29 వేల చెక్కును స్థానిక కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే బండారి అందజేశారు.

మల్లాపూర్‌లో ఇంటికి వచ్చి..

మల్లాపూర్ డివిజన్ సూర్యనగర్ కాలనీకి చెందిన బొజ్జ సురేష్ కుమార్తె బొజ్జ తులసి భవానీ ఉస్మానియా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. బీఎల్ఆర్ ట్రస్ట్ తరుపున ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్వయంగా ఎంబీబీఎస్ విద్యార్థి ఇంటికొచ్చి స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో విద్యార్థులు ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తానని తెలిపారు.

యూటర్న్‌ను పునరుద్ధరించాలి



పీర్జాదీగూడ మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న కొల్తూరి సాయి

మేడిపల్లి: వరంగల్ జాతీయ రహదారిపై స్పార్క్ ఆసుపత్రి వద్ద ఉన్న యూటర్న్‌ను పునరుద్ధరించాలని కొల్తూరి సాయి మేయర్ అమర్‌సింగ్‌ను కోరారు. పీర్జాదిగూడ, పర్వతాపూర్, కాచవాని సింగారం, ప్రతాప్ సింగారం వెళ్లే వాహనదారులు పీర్జాదిగూడ కమాన్ మార్గం ద్వారా తమ గమ్యాలకు వెళ్ళేవారు. అయితే అక్కడ ట్రాఫిక్ సమస్య తీవ్రం కావడంతో ట్రాఫిక్ పోలీసులు స్పార్క్ అనుపత్రి ముందు యూటర్న్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పలు కారణాలతో ఆ యూటర్న్‌ను మూసివేయడంతో ఉప్పల్ నుంచి వచ్చేవారు, అటు నారాపల్లి, మేడిపల్లి నుంచి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురౌతున్నారని, వెంటనే యూటర్న్ సమస్యను పరిష్కరించాలని ఆయన అధికారులను కోరారు. అనంతరం మేయర్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన మేయర్ అమర్‌సింగ్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిస్కరిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు.

18 ఏళ్లు నిండితే.. ఓటరుగా నమోదు చేయించాలి



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో వార్డు మెంబర్ల సహకారంతో 18 ఏళ్ల నిండిన యువత కొత్తగా ఓటరు గుర్తింపు కార్డు నమోదు చేసుకునేలా పార్టీల ప్రతినిధులు చొరవ తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో డీఆర్ఓ హరిప్రియతో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువత శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ, ఓటరు నమోదు శాతం పెరగడం లేదన్నారు. ఇందుకుగాను వార్డు మెంబర్ల భాగస్వామ్యంతో యువత కొత్తగా ఓటరు గుర్తింపు కార్డు నమోదు చేసుకునేలా చూడాలని పార్టీ ప్రతినిధులను కోరారు. జిల్లాలో ఓటరు నమోదు శాతాన్ని పెంచాలని చెప్పారు. భారత ప్రభుత్వ ఎన్నిక కమిషన్ సూచనల మేరకు జిల్లాలో ఓటర్లకు అనుకూలంగా ఉండేలా, 1500 మందికి ఒక పోలింగ్ బూతు ప్రకారం జిల్లాలో అదనంగా 38 పోలింగ్ బూతులను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో అదనంగా నియోజక వర్గాల వారీగా మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 21, మల్కాజిగిరిలో 7, కుత్బుల్లాపూర్‌లో 10 పోలింగ్ బూతులను ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం జిల్లాలో 2,435 పోలింగ్ బూతులు ఉన్నాయని చెప్పారు. ఓటర్లకు సమీపంగా, సౌకర్యవంతంగా ఉండేలా పరిశీలించి ఈ పోలింగ్ బూతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూతుల నెంబర్ల సవరింపులో కొన్ని బూతుల నెంబర్లు మారుతాయని, బూతు పోలింగ్ అధికారులు ఈ మార్పు పై ఓటర్లకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, ఎన్నికల విభాగం అధికారి రాజేశ్వర్ రెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడికి సత్కారం



అల్వాల్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మల్కాజిగిరి నియోజకవర్గం అధ్యక్షుడిగా నియమితులైన పుట్నాల కృష్ణను మంగళవారం ఫోరం తెలంగాణ చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శాలువాతో ఘనంగా సత్కరించారు. ఫోరం సెక్రటరీ సురేందర్‌రెడ్డి, స్థానిక ఉద్యమకారులు ఉదయ్, శోభన్‌బాబు, వెంకటేష్‌యాదవ్, ముత్యాలు, ఆనంద్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

మాజీ రాష్ట్రపతికి ఘన నివాళి



ఈసీఐఎల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

కాప్రా: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఈసీఐఎల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మంగళవారం ఈసీఐఎల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కలాం ఆశయాలకు అనుగుణంగా మెలగాలని సూచించారు. మహారాష్ట్ర మాదిరిగా తెలంగాణ ప్రభుత్వం కూడా పేపర్స్ అసోసియేషన్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అసోసియేషన్ సభ్యులు వెంకటరమణ, సుధాకర్, చితారి రాజు, హమీద్, సాయి, నరేష్, నరసింహ, గురుస్వామి, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌తో విడదీయరాని అనుబంధం

వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నలక్ష్మి



కార్యక్రమంలో డా. ప్రసన్నలక్ష్మి, వీరయ్య, భాస్కర్ తదితరులు

అల్వాల్: అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నలక్ష్మి, ఫార్మసిస్ట్ వీరయ్య, భాస్కర్‌లు బదిలీ సందర్భంగా మంగళవారం అల్వాల్ పంజాబీ కమ్యూనిటీహాల్‌లో ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత 13 ఏళ్లుగా ఇక్కడ వైద్యసేవలు అందించానని, అల్వాల్ ప్రాంతంలో విడదీయరాని బంధం ఏర్పడిందన్నారు. కోవిడ్ సమయంలో వైద్యసేవలు అందించడం పూర్వజన్మ సుకృతంగా భావించామన్నారు. అనంతరం పలువురు డాక్టర్లు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, స్థానిక నేతలు వారిని శాలువాలతో సత్కరించారు. కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్, రాజు, రవి, లక్ష్మణ్, ఉద్యమకారుల ఫోరం జనరల్ సెక్రటరీ సురేందర్‌రెడ్డి, అనిల్‌కిషోర్, దయాకర్, రవి, భాస్కర్, డాక్టర్ శైలజ, డాక్టర్ రాజేందర్, డాక్టర్ అనగ్, డాక్టర్ శ్వేత, డాక్టర్ రూప, వైద్య సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.